క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ సోమవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేసిన రోటరీ సభ్యులు

యద్దనపూడి: సేవా కార్యక్రమాలతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు అన్నివేళ్లలో ముందంజలో ఉంటుందని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని జాగర్లమూడి, ఏఎస్ ఉన్నత పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు నాగుబడి సుబ్బారావు ఆర్థిక సహకారంతో నోట్స్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు దూళ్లిపల్లి సత్యనారాయణ, పంబి సదానాందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖర్, రోటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు బైకును ఢీకొన్న ఆటో



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

మేదరమెట్ల: రాంగ్‌రూట్‌లో ఆటో బైకును ఢీకొట్టడంతో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన సోమవారం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ ఎదురుగా జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన కర్రి శివరామకృష్ణ బైకుపై ఒంగోలు వెళ్తున్నాడు. బైకు తిమ్మనపాలెం కుబేరా హోటల్ వద్దకు రాగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణ రోడ్డుపై పడిపోయాడు. దీంతో కాలికి తీవ్రగాయం కాగా ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో ఒంగోలు వైద్యశాలకు తరించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న రాంబాబు

చీరాల: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు చైర్ పరిశోధకుడు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో ఈపూరుపాలెంలోపేద విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు ఆయనను రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన బైకు

అద్దంకి రూరల్: మద్యం మత్తులో బైకును కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అపస్మారక స్థితికి చేరాడు. ఈఘటన మండలంలోని చినకొత్తపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. 108 సిబ్బంది వివరాల మేరకు.. కారుమంచికి చెందిన మల్లవరపు నాగేశ్వరరావు సోమవారం పూటుగా మద్యం తాగి అత్తగారి గ్రామం చినకొత్తపల్లికి వస్తున్నాడు. మద్యం మత్తులో గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెంటనే అద్దంకి 108 వాహనానికి సమాచార అందించారు. వాహనం అక్కడకు చేరుకుని ప్రథమ చికిత్స చేసి అనంతరం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, ఆశ్వీయుజ మాసం ఉత్తర ఫల్గుణి నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు. కావున భక్తులు గమనించాలని ఆయన కోరారు.

పేలని చిచ్చుబుడ్డి.. పైకెగరని తారాజువ్వ



బాణాసంచా విక్రయించే హోల్ సేల్ గోడౌన్



విక్రయాల కోసం ర్యాక్‌లో పేర్చి ఉన్న బాణాసంచా

- దెబ్బకొట్టిన తుఫాన్- బాణసంచా విక్రయాల నేలచూపు
- 30 శాతం సరుకు కూడా అమ్ముడుపోలేదని ఆందోళన
- గతేడాది 70 శాతం బాణసంచా అమ్మకాలు
- ఆందోళన చెందుతున్న వ్యాపారులు

వేటపాలెం: చిచ్చుబుడ్లు పేలకుండానే మంటలు పెడుతున్నాయి. భూచక్రాలు తిరగకుండానే ధరలతో గిర్రుమనిపిస్తున్నా.. తారాజువ్వలు పైకెగరకుండానే చుక్కలను చూపిస్తున్నాయి. దీపావళి అంటే చాలు చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు సందడి చేస్తుంటారు. ఆరోజు ఎంతటి వారైనా సరే.. ఉల్లాసంగా దీపావళి బాణసంచా కాల్చి ఇంటిల్లిపాది పిండివంటలతో సంతోషంగా గడుపుతుంటారు. కాని గత కొన్నేళ్లుగా బాణసంచా సామగ్రి రేట్లు అమాంతంగా పెరిగి సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయింది. ప్రధానంగా హోల్ సేల్ డీలర్లు దగ్గర రిటైలర్లు సరుకు కొనుగోలు చేసుకొని పండుగ రెండు రోజులు ముందు విక్రయాలు చేస్తుంటారు. ఇంకా పండుగ రెండు రోజులు మాత్రమే ఉంది. ఇప్పటికే హోల్‌సేల్ వ్యాపారుల వద్ద 90 శాతం సరుకు విక్రయాలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఈ ఏడాది ఇప్పటికి కేవలం 30 శాతం వ్యాపారం మాత్రమే జరిగిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారం కోసం సరుకు కొనుగోలు కోసం రూ. 35 లక్షలు పెట్టుబడి పెట్టి బాణసంచా నిల్వచేశామన్నారు. కాని వ్యాపారం మాత్రం వెలవెలబోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవడం కారణంగా కనిపిస్తుందని వ్యాపారులు చెప్తున్నారు. వేటపాలెంలో 30 ఏళ్లగా ఇద్దరు హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. వారు గ్రామాలకు దూరంగా గోడౌన్‌లో బాణాసంచా నిల్వలు ఉంచి విక్రయాలు జరుపుతుంటారు. వీరి వద్ద నుంచి రిటైల్ వ్యాపరులు టపాసులు కొనుగోలు చేసుకొని వారి గ్రామాల్లో చిన్నచిన్న షాపుల్లో అనుమతులు తీసుకొని విక్రయాలు నిర్వహిస్తుంటారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి..

- బాణసంచా కాల్చేటప్పుడు నాణ్యతమైన కళ్లద్దాలు, కాటన్ వస్త్రధారణతో సహా తగిన దుస్తులు ధరించాలి.
- పొడవాటి వెంట్రుకలు మంటలు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పొరపాటున మంటలు తగిలేలా వదులుగా ఉండే దుస్తులను ధరించవద్దు.
- బాణసంచా కాల్చిన తర్వాత సురక్షితమైన దూరాన్ని పాటించాలి.
- వెలగని బాణసంచా కాల్చడానికి ప్రయత్నించకండి. అది చల్లబడే వరకు వేచి ఉండి, ఆపై దానిని సరిగ్గా పారవేయాలి.
- ఉపయోగించిన బాణసంచాను సురక్షితంగా, బాధ్యతాయుతంగా పారవేయాలి.
- కర్టెన్లు, కాగితం అలంకరణలు మండే పదార్థాల నుంచి వాటిని దూరంగా ఉంచాలి.
- పిల్లలు లేదా పెంపుడు జంతువులకు టపాసులు అందుబాటులో ఉంచవద్దు.

కాలిన గాయాలకు చేయాల్సిన ప్రథమ చికిత్స..

- కనీసం 10 నిమిషాల పాటు చల్లటి నీటితో మంటను వెంటనే చల్లబరచాలి. ఇది కాలిన ప్రాంత ఉష్ణోగ్రతను తగ్గించడానికి, నొప్పిని తగ్గించడానికి సహాయపడుతుంది.
- శీతలీకరణ తర్వాత, ఇన్ఫెక్షన్ రాకుండా ఉండటానికి శుభ్రమైన, నాన్ స్టిక్ క్లాత్ లేదా ప్లాస్టిక్ ర్యాప్‌తో కాలిన ప్రదేశాన్ని కవర్ చేయాలి.
- తీవ్రంగా కాలిన గాయాలు, ముఖం, చేతులు, పాదాలు, జనేంద్రియాలు పెద్దగా కాలినట్లు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

వ్యాపారాలు స్తబ్దుగా ఉన్నాయి..

ఈ ఏడాది బాణసంచా హోల్‌సేల్ వ్యాపారాలు స్తబ్దుగా ఉన్నాయి. గత ఏడాది ఇప్పటికే 70 శాతం పూర్తయింది. ప్రస్తుతం 30 శాతం వ్యాపారం జరిగింది. వర్షాల ప్రభావం విక్రయాలపై పడింది. ప్రజల వద్ద డబ్బులు లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది.

– సత్యనారాయణ, వేటపాలెం

నీటి కుంటలే ప్రత్యామ్నాయం



మండలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంట



పంటభూమిలో ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వ కుంట

- వ్యవసాయ భూముల్లో నీటి కుంటలతో అవసరం
- వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు రక్షణ

మేదరమెట్ల: ఉద్యాన పంటలతోపాటు, కంది, మిరప వంటి పంటలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం పండించిన పంట, నోటిదాకవచ్చే సయమానికి, వర్షాలు లేక కళ్లముందే పంట ఎండిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితుల్లో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అలా వేసిన పంటలు ఎండిపోకుండా ఉండేందుకు పొలాల్లో ఏర్పాటు చేసుకునే కుంటలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి..

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పొలాల్లో వేసిన బోర్లు, బావులు అడుగంటి పోయేందుకు ఎక్కువగా అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులను అధికమించేందుకు గాను ప్రతి రైతు తమ పొలంలో నీటి బ్యాంకు (నీటికుంటలు)ను ఏర్పాటు చేసుకొని భూమిపై పడిన ప్రతి నీటిచుక్కనూ వడిసిపట్టేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొరిశపాడు మండల వ్యవసాయాధికారి పీ. శ్రీనివాసరావు తెలిపారు. అలా కుంటలో దాచి ఉంచిన నీటిని, వర్షాలు లేని సమయంలో పంటలకు పెట్టుకుంటే, నోటి వరకు కొచ్చిన పంట చేతికందే అవకాశాలు ఉంటాయి. పూర్వ కాలంలో ఇలాంటి కుంటలు ఉండేవి, రాను రాను, వర్షాలు సక్రమంగా కురవడం, వాటి అవసరం తక్కువ కావడం, నేల వృథాగా పోతుందనే ఉద్దేశంతో రైతులు ఉన్న కుంటలను పూడ్చివేసిన విషయం అందరికి తెలిసిందే.



శ్రీనివాసరావు, ఏవో, కొరిశపాడు

నీటి కుంటలతో ఎన్నో ప్రయోజనాలు..

ప్రతి రైతూ తమ పొలంలో నీటి ప్రవాహం నిల్వ చేరే చోట నీటి కుంటలను తవ్వుకోవాలి. దీనివలన వర్షపు నీరు కుంటలో నిల్వ ఉండటం జరుగుతుంది. అలా చేరిన నీటిలో నత్రజని శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ నీటిని వ్యవసాయానికి గాని మొక్కల పెంపకానికి గాని వినియోగించుకోవడం వలన పంటలు ఆరోగ్యంగా అధిక పంటలను పండేందుకు దోహదపడతాయని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. రైతుల అవసరాలను బట్టి 8x8 సైజులో కానీ 25x25 సైజులో 2లేదా 3మీటర్ల లోతులో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి. 8x8x2 సైజులో నిర్మించుకున్న కుంటలో 72 వేల లీటర్ల నీరు ఉంటుంది. ఈ విధంగా రైతులు పొలాల్లో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భజలాలు పెరగడంతో పాటు పంటను బెట్టకు రాకుండా కాపాడుకోవచ్చని ఏవో సూచిస్తున్నారు. ఈ తరుణంలో రైతులందరూ తమ వ్యవసాయ భూముల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవడానికి ఉద్యమంలా ముందుకు రావాలని ఏవో సూచిస్తున్నారు. అంతేకాకుండా పర్యావరణాన్ని కాపాడినవాళ్లమవుతామని చెప్పారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు

కారంచేడు: ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఐకేపీ ఏపీఎం కే మోహనరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించి చీరాలకు బదిలీపై వెళ్లిన ఏపీఎం మధుసూదనరావు, సీసీలు వేణు, అశోక్‌లకు వీడ్కోలు సభ నిర్వహించి వారి సేవలను కొనియాడారు. అనంతరం ఇక్కడ విధులకు వచ్చిన మోహనరావు, సీసీలుగా సుబ్బారావు, ఇస్సాక్‌లను కూడా మహిళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన సిబ్బంది, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు

మాలధారులకు అన్న వితరణ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

అద్దంకి రూరల్: అద్దంకిలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం నుంచి అయ్యప్ప మాలధారణ స్వాములకు 14వ వార్షిక అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. డిసెంబర్ 14వ తేదీ వరకు 48 రోజులు కొనసాగుతుందని తెలిపారు. తొలిరోజు వల్లెపు వెంకటేశ్వర్లు, శేషమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు పరుచూరి శ్రీనివాసరావు, తిరుపతి రెడ్డి, శ్రీరాం రామలింగేశ్వరరావు, బీ. బాపయ్య, ఎం అంజయ్య తదితరులు పాల్గొన్నారు

నవంబర్ 3న మాదిగల ఆత్మీయ సదస్సు

ఇంకొల్లు (చినగంజాం): మాదిగల ఆత్మీయ సదస్సు సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట లక్ష్మీనరసయ్య కోరారు. ఇంకొల్లు మండలం స్టాలిన్ పేటలో ఏబీఎస్ చర్చిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశం నిర్వహించారు. నవంబర్ 3న ఒంగోలులో జరిగే మందకృష్ణ మాదిగ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెపోగు నాని, కారంచేడు మండల అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో డయేరియా నివారణ



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రస్తుతం డయేరియా విజృంభించే ప్రమాదముందని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోర్లంట్ల సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు ప్రజల్లో డయేరియా వ్యాప్తిని అరికట్టేలా చైతన్యం తీసుకురావాలన్నారు. మల, మూత్ర విసర్జన తరువాత భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సైతం ఈ పద్ధతిని పాటించాలన్నారు. ప్రతి రోజు ఇంట్లో కాచి, చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఆహారంను వేడి వేడిగా సిద్ధం చేసుకొని తినాలన్నారు. పడుకొనే సమయంలో తప్పకుండా దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ వీరమ్మ, హెచ్ఎస్ శ్రీనివాసరావు, శాంతిప్రియ, జగదీశ్వరి, తిరుపతమ్మ, మేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీలో మెడికల్ క్యాంప్



విద్యార్థినులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జంతు శాస్త్ర విభాగం, రైట్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళీ, రైట్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ దీవెన, జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్.అంకమ్మ పాల్గొన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులో విద్యార్థినులకు బీఎంఐ, బీపీ, హిమోగ్లోబిన్, షుగర్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ దీవెన విద్యార్థినులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, రైట్ హాస్పిటల్ నుంచి డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రశాంత్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కృషి



శివన్నారాయణ డీఎల్‌పీవో

చీరాల టౌన్: డివిజన్ పరిధిలోని మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని నూతన డీఎల్‌పీవో బీ శివన్నారాయణ తెలిపారు. చీరాల డివిజినల్ పంచాయితీల అధికారిగా (డీఎల్‌పీవో ఇన్‌చార్జి) వేమూరు ఎంపీడీవో బి.శివన్నారాయణను నియమించగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, ఇంకొల్లు, పర్చూరు, బల్లికురవ, కొరిశపాడు మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు అందరు తమ గ్రామాల్లో ఉన్న పెండింగ్ పనులు, చేపట్టాల్సిన పనులపై నివేదికలు తయారు చేయాలని ఆదేశించామన్నారు. అనంతరం నూతన డీఎల్‌పీవోను పలు గ్రామాల కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసిన జడ్జి

పర్చూరు (చినగంజాం): జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14న పర్చూరు కోర్టు భవనాల సముదాయం నందు నిర్వహిస్తారని జూనియర్ సివిల్ జడ్జి పీ ప్రశాంతి తెలిపారు. పోలీసులతో సోమవారం కోర్టులో ఆమె సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి అర్జీదారులు, కక్షిదారులకు వివరించాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పు అని ఆమె తెలిపారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి, యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి, కారంచేడు ఎస్ఐ మధుబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ రిసార్ట్‌ల్లో ఆకస్మిక తనిఖీలు



రిసార్టుల్లో రికార్డులు తనిఖీ ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: మండల పరిధిలోని కఠారివారిపాలెం, రామాపురం సముద్రతీరం వద్ద ఉన్న బీచ్ రిసార్ట్‌లను ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసార్టుల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాతూ గుర్తింపు కార్డులు లేకుండా రిసార్టుల్లోకి ఎవ్వరినీ అనుమతించ వద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పిడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారి వద్ద తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పూర్తి చిరునామాలు నమోదు చేసుకొని రిసార్టులు అద్దెకు ఇవ్వాలని సూచించారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా యువజన వారోత్సవాలు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ సామాజిక భవనంలో యువజన వారోత్సవాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సోమవారం జరిగిన దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 63 మంది విద్యార్థులు పాల్గొని దేశభక్తి గీతాలు, స్ఫూర్తి గీతాలను ఆలపించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రూపాదేవి, గురువర్ధినిలు వ్యవహరించారు. వారం రోజులు పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్‌ల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, టి.లక్ష్మీప్రతాప్, జీవై ప్రసాద్, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు భానుకుమారి, కార్యదర్శి తల్లం రమా, క్లబ్ డిస్ట్రిక్ట్ ఎడిటర్ సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థి

భగవద్గీతతో మానసిక వికాసం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, అతిథులు

అద్దంకి రూరల్: భగవద్గీతను చదివితే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుంతుందని టీటీడీ హిందుధర్మ ప్రచార మండలి సభ్యుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీటీడీ దేవస్థాన హిందు ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి ఆకెళ్ల విభీషశర్మ రచించిన 'మానవులందరికీ భగవద్గీత' పుస్తకాన్ని స్థానిక ప్రియదర్శిని ఫర్నీచర్ షాప్ వద్ద ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు బోధించిన భగవద్గీత కేవలం పూజా మందిరంలో ఉండే పుస్తకం కాదన్నారు. సరిగ్గా గీతను చదివితే మనిషి మానసికంగా, శారీరకంగా ఎదగడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, యు. దేవపాలన, చెన్నుపాటి రామాంజనేయులు దివాకరదత్తు తదితరులు పాల్గొన్నారు.